క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కే రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ యాదవనగర్, పోస్టాఫీసు ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు. 11కేవీ బ్యాంక్ కాలనీ, లింగోజిగూడ, శివపురికాలనీ, భగత్ సింగ్‌నగర్, జే.బీ.కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు. 11కేవీ కొత్తపేట ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 4గంటల వరకు. 11కేవీ హరిపురి కాలనీ ఫీడర్ పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

'కంటి వెలుగు' శిబిరం పరిశీలన



కంటి పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలిస్తున్న పద్మలత

కందుకూరు: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని గురువారం రాష్ట్ర కంటి వెలుగు క్వాలిటీ తనిఖీ అధికారి డాక్టర్ పద్మలత పరిశీలించారు. అక్కడ కొనసాగుతున్న కంటి పరీక్షలు, సిబ్బంది పని తీరును పర్యవేక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీందర్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగంపల్లి, విఠాయిపల్లిలో పంటల పరిశీలన

ఆమనగల్లు: మండల పరిధిలోని సింగంపల్లి, విఠాయిపల్లి గ్రామాల్లో గురువారం మండల వ్యవసాయాధికారి అరుణకుమారి, ఏఈఓ శివతేజ ఆధ్వర్యంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. వేరుశనగ, ఆముదం, మామిడితోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వేరుశనగలో తొలిపూత సమయంలో జిప్సంను ఎకరానికి 200 కిలోలు వేసుకోవాలని అరుణకుమారి సూచించారు. వరిపంటలో కాండం తొలచు పురుగు నివారణకు ఫటేరా గులికలు ఎకరాకు 6కిలోలు వేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు శ్రీనివాస్, బాల్‌రాం, మల్లయ్య, పాండయ్య, మల్లయ్య, సేవ్య, మంగ్య, అంజమ్మ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళాల వెల్లువ

ఆమనగల్లు: మాడ్గుల మండలం కొల్కులపల్లి గ్రామంలో పునర్నిర్మిస్తున్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణానికి విరాళాలు వెల్లువెత్తుతున్నాయి. ఆలయ నిర్మాణానికి కొల్కులపల్లి గ్రామస్తులతో పాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లో ఉంటున్న గ్రామానికి చెందిన పలువురు విరాళాలు అందించారు. ఆలయం ఆవరణలో గురువారం గ్రామసర్పంచ్ బట్టు అనురాధ, ఎంపీటీసీ బట్టు కిషన్‌రెడ్డికి పలువురు విరాళాలు అందించారు. నర్సింహగౌడ్, అంతమ్మ జ్ఞాపకార్థం మల్లయ్య, సుమతమ్మ, శ్రీనివాసు కలిసి రూ.లక్ష, చంద్రారెడ్డి, నర్సమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గోపిడి వెంకట్‌రెడ్డి రూ.50 వేలు, వడ్డెపల్లి పర్వతాలు, హేమలత దంపతులు రూ.21 వేలు, పంజుగుల రాజేందర్, లక్ష్మమ్మ దంపతులు రూ.21 వేలు, కాసుల వెంకటేశ్ రూ.51వేలు విరాళం అందించారు. స్థానికులు యాదయ్య, జగతయ్య, జంగయ్య, శేఖర్, నర్సిరెడ్డి, పర్వతాలు, వెంకన్న, బాలరాజుగౌడ్, మాధవరెడ్డి, విజేందర్‌రెడ్డి, పులెమల్ల బుచ్చయ్య, పాండు, లక్ష్మయ్య, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అద్దె భవనంలోకి అంగన్‌వాడీ కేంద్రం



భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ

కడ్తాల్: మండల పరిధిలోని గడ్డమీదితండాలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలు ఒకే భవనంలో నిర్వహిస్తున్నారని దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామ సర్పంచ్ పాండునాయక్ బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు. సమస్యపై స్పందించిన జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సంబంధిత అధికారులతో కలిసి గురువారం గడ్డమీదితండాకు చేరుకుని అంగన్‌వాడీ, పాఠశాల వేరువేరుగా నిర్వహించాలని.. అంగన్‌వాడీని అద్దె భవనంలోకి మార్చాలని సూచించారు. అంగన్‌వాడీ భవన నిర్వహణకయ్యే అద్దెను రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా తాను చెల్లిస్తానని హామీ ఇచ్చారు. దీంతో సమస్య పరిష్కారం కావడంతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి, సర్పంచ్ పాండునాయక్, ఉపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపసర్పంచ్ రమణ, వార్డు సభ్యులు సోమ్లా తదితరులు ఉన్నారు.

ఆకలి తీరుస్తున్న రూ. 5భోజనం

- పేదలు, కూలీలు, నిరుద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయోగం
- ప్రతిరోజూ 300 మందికి పైగా భోజనం
- ప్రభుత్వ నిర్ణయంపై పలువురి హర్షం



సరూర్‌నగర్‌లో రూ. 5కే భోజనం చేస్తున్న జనం

హుడాకాంప్లెక్స్: నిరుపేదలు, మధ్య తరగతి వారు పస్తులు ఉండాల్సిన పరిస్థితి లేదనే ధైర్యం వచ్చింది. అసంఘటిత కార్మికులకు పని దొరకలేదనే బాధ.. ఈ పూట ఎలా గడుస్తుందనే దిగులు చెందాల్సిన పరిస్థితులు పోయాయి. పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు వంట చేసుకోవడానికి సమయం వృథా అవుతుందనే చింత తప్పింది. ఆటో, రిక్షా కార్మికులు, దినసరి కూలీలకు రోడ్డుపై చిన్నచిన్న పని చేసుకునే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రూ. 5 భోజనం భరోసా ఇస్తోంది. పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన రూ. 5 భోజనం పేదలకు, నిరుద్యోగ యువతకు, అసంఘటిత కార్మికులకు ఎంతగానో ఉపయోగపడుతోంది. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు, విద్యార్థులు వివిధ పనుల నిమిత్తం బయటకు వెళ్లి, రూంలకు వెళ్లి వంట చేసుకుని తిరిగి రావాలంటే సమయం వృథా అవుతుంది. తక్కువ ధరకు నాణ్యమైన భోజనం అందించడంతో విద్యార్థులు కూడా ఈ కేంద్రం వద్ద తినడానికి ఇష్టపడుతున్నారు. రూ. 5లకు నాణ్యమైన భోజనం అందిస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఒక కూర, పప్పు, సాంబార్, పచ్చడి పెడుతున్నారు. ప్రతి ఆదివారం ఒక స్వీట్ ప్రత్యేకంగా అందిస్తున్నారు. ఈ విధంగా ప్రతి రోజూ సంపూర్ణ భోజనం అందించడం విశేషం. ఈ కేంద్రం వద్ద ప్రతి రోజు 300 మందికి భోజనం అందిస్తున్నారు.

ప్రభుత్వ నిర్ణయం గొప్పది



పేదల ప్రభుత్వం కాబట్టి పేదలు పస్తులు ఉండకుండా కేవలం రూ. 5కే భోజనం అందిస్తోంది. నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్న ప్రస్తుత తరుణంగా రూ. 5కే భోజనం పెట్టడం గొప్ప విషయం. ఈ పథకం ద్వారా చాలా మంది ఆకలి తీరుతోంది. ప్రభుత్వం పేదలను దృష్టిలో పెట్టుకుని మరిన్ని సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలి.

– విజయ్ భాస్కర్, టైలర్

కూలీలకు ఎంతో మేలు



ప్రతిరోజూ ఈ ప్రాంతంలో కూలీకి వెళ్తాను. గతంలో మధ్యాహ్నం రూమ్‌కు వెళ్లి వంట చేసుకుని తినాలంటే సమయం వృథా అయ్యేది. రూ. 5 భోజనంతో ఎంతో మేలు జరుగుతోంది. నాతో పాటు చాలా మంది కూలీలు ప్రతిరోజూ మధ్యాహ్నం ఇక్కడకు వచ్చి భోజనం చేసి వెళ్తాం. రూ. 5కు సింగిల్ ఛాయ్ కూడా రావడం లేదు. అలాంటిది అన్నం, పప్పు, కూర అందిస్తున్నారు. ప్రభుత్వం పేదల ఆకలిని తీరుస్తోంది. రూ. 5కు భోజనం పెట్టడం సంతోషంగా ఉంది.

– దత్తు, కూలీ

300మందికి భోజనం



ఎల్‌బీనగర్ చౌరస్తాలో కూలీలు, నిరుద్యోగులు ఎక్కువగా భోజనం చేస్తుంటారు. ఎండా కాలం, వానా కాలం నిలబడి భోజనం చేయడం కొద్దిగా కష్టం. షెడ్డు లాంటిది ఏర్పాటు చేస్తే ఎక్కువ మంది భోజనం చేసే వీలుంటుంది.

– వెంకట సుబ్బయ్య

సబితకు క్షమాపణలు చెప్పాల్సిందే

- లేకపోతే బీజేపీ నేత శంకర్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తాం
- బీఆర్‌ఎస్ నాయకుల హెచ్చరిక



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బడంగ్‌పేట్: మంత్రి సబితారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత శంకర్‌రెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేకపోతే ఆయన ఇంటిని ముట్టడిస్తామని బీఎస్‌ఎస్ నాయకులు హెచ్చరించారు. గురువారం బీఆర్‌ఎస్ బాలాపూర్ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి మాట్లాడుతూ.. మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత శంకర్‌రెడ్డి ఆమె కాలిగోటికి కూడా సరితూగడన్నారు. మంత్రి సబితారెడ్డి చుట్టమని ఆమె పేరు చెప్పుకుని ఎన్నో పైరవీలు చేసుకొని బతికే నీవు ఆమెనే విమర్శిస్తావా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి మూడేళ్లలో రూ.3 వందల కోట్లు తీసుకువచ్చిన సబితారెడ్డిని విమర్శించే హక్కు ఎవ్వరికీ లేదన్నారు. బాలాపూర్ చెరువును సుందరీకరణ చేస్తుంటే కబ్జాలు చేస్తున్నావని అనడం మంచిది కాదని హితవు పలికారు. అధికార పార్టీ పెద్దలతో పాటు ప్రతిపక్ష పెద్దలకు కూడా గౌరవం ఇచ్చి మాట్లాడే మంత్రిని ఏక వచనంతో మాట్లాడి అవమానిస్తావా అని మండిపడ్డారు. మహేశ్వరం గడ్డపై సబితారెడ్డి మరోమారు పోటీ చేస్తుందని, భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తప్పుగా విమర్శించానని బేషరతుగా క్షమాపణలు చెప్పాలని లేకుండా అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వంటేటి లక్ష్మారెడ్డి, క్లౌం ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యులు రఘునందన్‌చారి, చిగురింత నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు తిమ్మని గిరీష్, అత్తాపురం శ్రీనివాస్‌రెడ్డి, పోరెడ్డి వెంకట్‌రెడ్డి, కొప్పుల రాజు, అరవింద్‌గౌడ్, కోటగిరి మురళి, నితీన్‌రెడ్డి, బొర్ర మాధవరెడ్డి, గోపాల్, హరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు రండి



మంత్రి సబితారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు

మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డికి ఆహ్వానం

మహేశ్వరం: మండలంలోని అమీర్‌పేట్‌లో వెలసిన రామేశ్వరపుర శివాలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు జరిగే ఉత్సవాలకు హాజరుకావాలని మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డికి గురువారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉత్సవాల్లో భాగంగా గణపతి, నంది, పార్వతి, నాగదేవత, ధ్వజ శిఖర విగ్రహాల ప్రతిష్ఠ, పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌కు కూడా ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలసిన వారిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ సెక్రటరీ జీ అంజయ్య ముదిరాజ్, అమీర్‌పేట్ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ పీ నర్సింగ్, ఎంపీటీసీ కుమారి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్తపల్లి దేవరం గౌడ్, గ్రామపెద్దలు నందీశ్వర్, అంజయ్య, వెంకటేష్, అశోక్, రాజు, అనిల్, శ్రీశైలం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్నులు తగ్గించే దాకా పోరాటం

- డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి
- నేటి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలో జీహెచ్‌ఎంసీ కంటే అధికంగా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నరని, ఇందుకు నిరసనగా శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఉదయం 11 గంటలకు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. పన్నుల భారం మోయలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇంటి పన్నులు తగ్గించే వరకు పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. ధర్నాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ బడంగ్‌పేట మున్సిపల్ మాజీ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, బాలునాయక్, పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు పెద్దబావి వెంకట్‌రెడ్డి, ఎర్ర జైహింద్, బాల్‌నింగని జంగయ్య, పుట్టగళ్ల జగన్, బాల్‌రెడ్డి, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు తిని ఆవుకు గాయాలు

కడ్తాల్: అడవిపందుల వేట కోసం గుర్తుతెలియని వ్యక్తులు పెట్టిన పేలుడు పదార్థం తిని పాడిఆవు తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన మండలంలోని చల్లంపల్లి గ్రామ సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కడ్తాల్ పరిసర గ్రామాలకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు మండలంలోని చల్లంపల్లి గ్రామ సమీపంలోని వ్యవసాయపొలాల్లో అడవిపందుల వేటకోసం పూసలు పెట్టారు. గురువారం మధ్యాహ్నం చల్లంపల్లి గ్రామానికి చెందిన గడ్డం పర్వతాలు తన పాడి పశువులను మేత మేపడానికి పొలానికి తీసుకువెళ్లగా అందులో ఒక ఆవు మేత మేస్తూ ప్రమాదవశాత్తు పూసను తినడంతో.. ఆవు దవడ పగిలి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులకు సమాచారం అందించినట్లు బాధిత రైతు పర్వతాలు తెలిపారు.

వీఆర్‌ఏల మౌన దీక్ష

తుర్కయంజాల్: వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు మౌన దీక్ష చేపట్టారు. పేస్కేలు అమలుచేయాలని, 50 ఏళ్లు పైబడిన వారందరి వారసులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఎడ్ల వెంకటేష్, సెక్రటరీ జనరల్ నరసింహ, కన్వీనర్ ప్రసాద్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ఆమనగల్లు: పోలెపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీటీసీ దోనాదుల కుమార్ చెప్పారు. ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. నాయకులు నర్సిరెడ్డి, వెంకటయ్య, లాలయ్య, నవీన్, మహేశ్, వెంకటేశ్, రామకృష్ణ, పవన్, రాజు, గోపాల్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత



డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

మీర్‌పేట: మంత్రి సబితారెడ్డి సహకారంతో కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లను దశల వారీగా అభివృద్ధి చేస్తున్నామని మేయర్ ఎం దుర్గ తెలిపారు. 38వ డివిజన్ డీఎస్‌ఆర్ కాలనీలో రూ. 5లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. అనంతరం ఎస్‌ఎన్‌డీపీ నాలా పనులను పర్యవేక్షించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ప్రత్యేక కార్పొరేషన్‌కు కృషి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌యాదవ్

హస్తినాపురం: తెలంగాణ రాష్ట్రంలో యాదవులకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న యాదవులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి నారగోని శ్రీనివాస్‌యాదవ్ గురువారం ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రస్తుత అసెంబ్లీ సమావేశాలలో కార్పొరేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రవికుమార్ యాదవ్, సాయియాదవ్, మహేశ్‌యాదవ్, విజయ్‌యాదవ్, టిల్లు యాదవ్, వెంకట్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ పనులను నిలిపేయండి

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని సాకిబండతండా సమీపంలోని సర్వే నెం.201లో చేపట్టిన మైనింగ్ పనులను వెంటనే నిలిపివేయించాలని సాకిబండతాండా రైతులు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ శ్యాంసుందర్‌ను తండాకు చెందిన రమేశ్‌నాయక్, కళ్యాణ్, రవి రాథోడ్, గోపాల్‌నాయక్, బాలునాయక్ కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. సాకిబండతండా సమీపంలో ఎన్నో ఏళ్లుగా రైతులు పంటలు సాగుచేసుకుని జీవిస్తున్నారని వారు వివరించారు. ఇటీవల మైనింగ్ పనులు ప్రారంభించడంతో తమ పంటలు దెబ్బతినడంతోపాటు బోర్లు పాడవుతున్నాయని వారు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మైనింగ్‌ను రద్దు చేయాలని వినతిపత్రంలో కోరారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన..

ఆమనగల్లు: ప్రజలందరికీ తాగునీరు అందించే బాధ్యత మున్సిపాలిటీదేనని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు ప్రతిభానగర్‌లో రూ.2 లక్షలతో చేపట్టిన తాగునీటి పైప్‌లైన్ పనులను గురువారం స్థానిక కౌన్సిలర్ చెక్కల లక్ష్మణ్‌తో కలిసి వారు పరిశీలించారు. కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

నేత్రపర్వంగా ఆలయ వార్షికోత్సవం

ఆమనగల్లు: మండలంలోని గేటుతండాలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో గురువారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాంనుంతల సర్పంచ్ సోన శ్రీనునాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, మాజీ సర్పంచ్ ఆనంద్‌నాయక్, విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడు పత్యానాయక్, పోలెపల్లి ఎంపీటీసీ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



శిశుమందిర్ స్కూల్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శ్రీరాములు యాదవ్

బడంగ్‌పేట్: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ కోరారు. గురువారం కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ జిల్లా పరిషత్ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు, అలాగే బడంగ్‌పేట శిశుమందిర్ స్కూల్ టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా అందెల శ్రీరాములు మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు సమయం దగ్గర పడుతుండడంతో వీడియో, ఆడియోతో కూడిన విజువల్స్ ఎఫెక్ట్ ఉన్న, నిపుణులు తయారు చేసిన స్టడీ మెటీరియల్ ఇస్తున్నట్లు తెలిపారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మురుగు సమస్య లేకుండా చూస్తాం



నందనవనంలో మురుగు నీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న మురుగు నీటి సమస్య శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కృషి చేస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. గురువారం నందనవనంకాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ మార్నింగ్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా సుజాతానాయక్ మాట్లాడుతూ... ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, టెంపుల్ డైరెక్టర్ అనిత, బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు ఆదిలక్ష్మి, యువజన అధ్యక్షుడు విజయ్, శశి, కాంతమ్మ, బుజ్జిబాయ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'కు స్పందన భళా

- పెద్ద ఎత్తున తరలివస్తున్న ప్రజలు
- పరీక్షల నిర్వహణపై సంతృప్తి
- కొందరికి అక్కడికక్కడే కళ్లద్దాల పంపిణీ
- అవసరమైన వారిని సరోజినీదేవి ఆస్పత్రికి సిఫారసు



మహిళకు కంటి అద్దాలు అందజేస్తున్న డీసీ మారుతీ దివాకర్

ఎల్‌బీనగర్: కంటి వెలుగు పథకానికి జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో అనూహ్య స్పందన లభిస్తోంది. మొత్తంమీద 37 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల ద్వారా రోజుకు సుమారు 400 మందికి కంటి పరీక్షలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కంటి సమస్యలతో బాధపడుతూ పరీక్షల కోసం వచ్చే వారితో పలు ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. పరీక్షల కోసం వచ్చే వారు అత్యధికంగా పేదలే వస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు పథకం పేదల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపుతోందని పలువురు పేర్కొంటున్నారు. సుమారు వంద రోజుల పాటు జరిగే కంటి వెలుగు కార్యక్రమంలో ఇద్దరు వైద్యాధికారులు, ఇద్దరు ఏఎన్‌ఎంలు, ఒక సూపర్‌వైజర్, ఒక ఆశా వర్కర్ కూడిన బృందం వచ్చిన వారికి వైద్య సేవలు అందించనున్నారు. వీరిలో అవసరం ఉన్న వారికి కంటి అద్దాలతో పాటు మందులు అందజేయనున్నారు.

మూడు సర్కిళ్ల పరిధిలో పరీక్షలు ఇలా...

జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల పరిధిలో ఇప్పటి వరకు 17,397 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. సర్కిల్–3 పరిధిలో 5,971 మందికి పరీక్షలు చేశారు. వారిలో 1,483 మంది కళ్లద్దాలను పంపిణీ చేశారు. దృష్టి లోపం ఉన్న 1,925 వారి కోసం ప్రత్యేకంగా అద్దాలను ఆర్డర్ ఇచ్చారు. 971 మందిని మెరుగైన వైద్యం కోసం కంటి అపరేషన్ల కోసం సరోజినీదేవి ఆస్పత్రికి సిఫారసు చేశారు.

సర్కిల్–4 పరిధిలో...

సర్కిల్ పరిధిలో వివిధ కేంద్రాల వద్ద ఇప్పటి వరకు 4,690 మందికి పరీక్షలు నిర్వహించారు. 1,296 మందికి కంటి అద్దాలను పంపిణీ చేయగా... దృష్టి లోపం ఉన్న 1696 మందికి ప్రత్యేకంగా అద్దాల తయారీకి ఆర్డర్ ఇచ్చారు. కంటి అపరేషన్లు కోసం 444 మందిని సరోజిని ఆస్పత్రికి సిఫార్సు చేశారు.

సర్కిల్–5 పరిధిలో...

ఎల్‌బీనగర్ సర్కిల్–5 పరిధిలో ఇప్పటివరకు 6,736 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 1893 మందికి అద్దాలను పంపిణీ చేశారు. 1397 మంది కోసం ప్రత్యేకంగా కళ్లద్దాల తయారీకి సిఫారసు చేశారు. ఈ సర్కిల్ పరిధిలో ఎవరినీ అపరేషన్ల కోసం సిఫార్సు చేయలేదని సంబంధిత అధికారులు వెల్లడించారు.

ఇబ్బందులు లేకుండా పరీక్షలు

కంటి వెలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించే వైద్యులు, సిబ్బందితోపాటు పరీక్షల కోసం వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామని డీసీలు మారుతీదివాకర్, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య తెలిపారు. మూడు సర్కిళ్ల పరిధిలోని ఆయా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు, ఇతర పరీక్షలు, ఆపరేషన్ల కోసం సరోజినీ ఆస్పత్రికి సిఫారసు చేస్తున్నారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం సుమారు వంద రోజులపాటు సాగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కంటి పరీక్షల కేంద్రాలను సద్వినియోగం చేసుకొని పరీక్షలు నిర్వహించుకోవాలని డీసీలు సూచించారు.